






అభ్యర్థుల పేర్లు, గుర్తులతో కూడిన పోస్టర్‌ను అతికిస్తున్న ఎన్నికల అధికారులు

న్యాల్‌కల్ మండలం హుస్సెల్లి, సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రాలు



ఎన్నికల సామగ్రితో కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

# పోలింగ్‌కు వేళాయె..

- సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు
- పోటీ పడుతున్న 102 మంది అభ్యర్థులు
- ఉదయం 7 నుంచి 5గంటల వరకు పోలింగ్
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- జిల్లావ్యాప్తంగా 1609 పోలింగ్ కేంద్రాలు,
- విధులు నిర్వహిస్తున్న 7068 మంది
- జిల్లాలో 35 మోడల్, 25 మహిళ, 5 యువత, 5 దివ్యాంగుల పోలింగ్ కేంద్రాలు
- 144 సెక్షన్ అమలు, అతిక్రమిస్తే చర్యలు
- డిసెంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు

సంగారెడ్డి, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు గురువారం పోలింగ్ జరగనున్నది. జిల్లాలోని సంగారెడ్డి, పటాన్‌చెరు, అందోలు, నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజక వర్గాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల బరిలో 102 మంది అభ్యర్థులు ఉన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి చింతా ప్రభాకర్‌తోపాటు 27 మంది పోటీ చేస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొణింటి మాణిక్‌రావుతోపాటు 21 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డితోపాటు 17 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. అందోలులో బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌తోపాటు 17 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పటాన్‌చెరులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డితోపాటు 15 మంది పోటీ చేస్తున్నారు. ఐదు నియోజకవర్గాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ,బీఎస్పీ పార్టీ అభ్యర్థులతోపాటు మొత్తం 102 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఓటర్లు ఎవరివైపు మొగ్గుచూపుతారోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

### 1609 పోలింగ్ కేంద్రాలు..

**★ ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం**

సంగారెడ్డి జిల్లాలోని 13,93,711 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు 1609 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరగనున్నది. బుధవారం రాత్రి గ్రామాలు, పట్టణాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లోని డ్రిస్టిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సిబ్బంది తమతోపాటు ఈవీఎంలు ఇతర ఎన్నికల సామగ్రి తీసుకుని పోలింగ్ కేంద్రాలను చేరుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి శరత్, ఎస్పీ రూపేశ్ డిస్టిబ్యూషన్ సెంటర్లను సందర్శించి పోలింగ్ సిబ్బంది తరలింపును పరిశీలించారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 13,93,711 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 702484 మంది పురుష, 691099 మహిళా ఓటర్లు, 128 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. వీరంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేపట్టింది. ఐదు నియోజకవర్గాల్లో అధికారులు 1609 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సంగారెడ్డిలో 281, అందోలులో 313, జహీరాబాద్‌లో 314, నారాయణఖేడ్‌లో 296, పటాన్‌చెరులో 405 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాల వైపు నడిపించేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా జిల్లాలో ప్రత్యేకంగా మహిళల కోసం నియోజకవర్గానికి ఐదు చొప్పున 25 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహిళా పోలింగ్ కేంద్రాల్లో పూర్తిగా మహిళా సిబ్బంది ఉంటారు. దివ్యాంగుల కోసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఐదు పోలింగ్ కేంద్రాలు, యువతకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఐదు పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. వీటితోపాటు 35 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. నారాయణఖేడ్‌లో 8, అందోల్‌లో 9, జహీరాబాద్‌లో 5, సంగారెడ్డిలో 5, పటాన్‌చెరులో 8 మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల అధికారులు ఇది వరకే ఓటరు స్లిప్‌లు పంపిణీ చేశారు. ఓటర్లు ఓటర్ స్లిప్‌తోపాటు ఫొటో ఓటరు గుర్తింపుకార్డుతో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాల్సి ఉంటుంది. ఫొటో ఓటరు గుర్తింపుకార్డు లేని పక్షంలో ఎన్నికల కమిషన్ పేర్కొన్న 16 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటుహక్కును వినియోగించుకోవచ్చు. సాయంత్రం ఎన్నికలు ముగిసిన వెంటనే ఈవీఎంలు స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3వ తేదీన చేపడతారు.

### 4500 మందితో బందోబస్తు..144 సెక్షన్ అమలు

సంగారెడ్డి జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ఎన్నికల కమిషన్, పోలీసుశాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేపట్టింది. సంగారెడ్డి జిల్లాలోని 1609 పోలింగ్ కేంద్రాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 4500 మంది కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు ఎన్నికల బందోబస్తులో పాల్గొననున్నారు. ఎస్పీ రూపేశ్‌తోపాటు ఇద్దరు అదనపు ఎస్పీలు, 12 మంది డీఎస్పీలు, 33 మంది సీఐలు, 65 మంది ఎస్సైలు, 590 మంది ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు, 691 మంది కానిస్టేబుళ్లు, 1240 మంది హోంగార్డులు బందోబస్తులో పాల్గొంటున్నారు. వీరితో పాటు 12 కంపెనీల కేంద్ర బలగాలు బందోబస్తులో పాలుపంచుకుంటున్నాయి. ఎన్నికల నేపథ్యంలో పోలీసుశాఖ పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. గ్రామాలు, పట్టణాల్లో ఐదుగురి కంటే ఎక్కువ మంది కలిసి తిరిగితే అరెస్టు చేశారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రూపేశ్ హెచ్చరించారు.



ఈవీఎంలను అందజేస్తున్న అధికారులు



సంగారెడ్డిలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రిని తనిఖీ చేస్తున్న రిటర్నింగ్ అధికారులు



సామగ్రిని నెత్తిన పెట్టుకుని వెళ్తున్న పోలింగ్ సిబ్బంది






సంగారెడ్డిలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రిని తీసుకుని కేటాయించిన పోలింగ్ కేంద్రానికి బస్సుల్లో వెళ్తున్న పోలింగ్ అధికారులు, సిబ్బంది

**సంగారెడ్డి జిల్లోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు**

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | ఓటర్లు |
|---|---|---|
| నారాయణఖేడ్ | 296 | 231188 |
| అందోలు | 313 | 249248 |
| జహీరాబాద్ | 314 | 270785 |
| సంగారెడ్డి | 281 | 245253 |
| జహీరాబాద్ | 405 | 397237 |

**ఎన్నికల పరిశీలకుల వివరాలు**

| | |
|---|---|
| జనరల్ అబ్జర్వర్లు | 3 |
| పోలీసింగ్ అబ్జర్వర్లు | 1 |
| ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్లు | 2 |
| మైక్రో అబ్జర్వర్లు | 296 |

**ఎన్నికల సిబ్బంది వివరాలు**

| | |
|---|---|
| మొత్తం ఎన్నికల సిబ్బంది | 7068 |
| పోలింగ్ ఆఫీసర్లు | 1906 |
| ఓపీవోలు | 1906 |
| ఏపీవోలు | 3256 |



ఎన్నికల సామగ్రిని తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది